20న మియాపూర్ రన్

గచ్చిబౌలి: తెలంగాణ రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మియాపూర్ రన్ 2వ ఎడిషన్ ఏప్రిల్ 20 నిర్వహించనున్నారు. మియాపూర్ లింక్ రోడ్డులో 10కే, 5కే, 5కే ఫన్ రన్‌లను నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం 6 గంటలకు రన్ ప్రారంభమవుతుంది. ఫన్ రన్ కోసం రూ. 300, 5కే రన్ కోసం రూ. 500, 10కే రన్ కోసం రూ. 700 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వికలాంగులైన చిన్నారుల కోసం ఫండ్ రైజింగ్ నిమిత్తం ఈవెంట్ నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు ఫోన్స్: 83675 81378, 98494 93010లలో సంప్రదించవచ్చు.

గణేషుడికి బెల్లంతో అభిషేకం



గణేషుడి విగ్రహం

రాయదుర్గం: సంకష్ట హర చవితిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో గణేషుడికి ప్రత్యేక పూజలను గురువారం నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య గణేషుడికి బెల్లంతో ప్రత్యేక అభిషేకం, తమలపాకుల హారంతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం షిరిడీ సాయిబాబా, కాశీవిశ్వేశ్వర స్వామి, అన్నపూర్ణాదేవి, ఆంజనేయ స్వామిలకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, అలంకారం చేశారు. పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రసాయనాల లీకేజీతోనే అగ్ని ప్రమాదం



మంటలర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పటాన్‌చెరు: రసాయనాలు లీకేజీతో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న ఘటన పాశమైలారం పారిశ్రామికవాడలో చోటుచేసుకుంది. పాశమైలారం పారిశ్రామికవాడలో వెంకార్ కెమికల్స్ పరిశ్రమలో గురువారం అగ్నిప్రమాదం చోటు చేసుకోవడంతో మూడు అగ్నిమాపక శకటాలు, పక్క పరిశ్రమల్లో ఉన్న మంటలను ఆర్పే ఎక్విప్‌మెంట్‌తో మంటలను పెరగకుండా అదుపు చేశారు. దీనికి తోడు పటాన్‌చెరు, సంగారెడ్డి నుంచి కూడా అగ్నిమాపక శకటాల రావడంతో రెండున్నర గంటల సమయంలోనే మంటలను అదుపులోకి తెచ్చారు. అత్యంత ప్రమాదకరమైన రసాయనాల లీకేజీ కారణంగానే అగ్నిప్రమాదం చోటు చేసుకుందని జిల్లా అగ్నిమాపక అధికారి నాగేశ్వరరావు తెలిపారు. యంత్రాలతో సహా పరిశ్రమ భవనం అగ్ని ప్రమాదంతో కాలిపోయినప్పటికీ, కార్మికులు షిఫ్ట్ మారే సమయంలో ప్రమాదం చోటు చేసుకోవడంతో ఎవరికి ఎటు వంటి ప్రమాదం సంభవించలేదని చెప్పారు.

ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జానకి రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల ఎంపీపీ కార్యాలయాన్ని గురువారం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జానకిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు.

పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలి

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



జడ్సీ ఉపేందర్‌రెడ్డితో కలిసి అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తున్న పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: ఆయా విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి పెండింగ్ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సూచించారు. గురువారం శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కార్యాలయంలో జడ్సీ ఉపేందర్ రెడ్డితో కలిసి అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రోడ్లు, డ్రైనేజీ మంచినీటి పైపులైన్, వీధి దీపాల వంటి మౌళిక వసతులకు పెద్దపీట వేయాలని అధికారులను కోరారు. రాబోయే వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నాలా విస్తరణ, చెత్త తొలగింపు పనులను వేగంగా చేపట్టాలన్నారు. లింకు రోడ్ల పనులు, కూడళ్లు, చెరువుల సుందరీకరణ పనులు, పార్కుల అభివృద్ధిపై రాజీ పడవద్దను పేర్కొన్నారు. ట్రాఫిక్ మెరుగదల కోసం ఫుట్ పాత్‌లు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యవలు పరిష్కరించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. వెస్ట్ జోనల్ ఎస్ఈ శంకర్ నాయక్, ఈఈలు దుర్గాప్రసాద్, ఇంద్రబాయి, డీఈలు విశాలాక్షి, శ్రీదేవి, ఏఈలు జగదీష్, ప్రశాంత్, రషీద్, ప్రతాప్, సంతోష్, సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చందానగర్‌లో ‘ఎర్లీబర్డ్’పై సమీక్ష



మాట్లాడుతున్న డీసీ మోహన్‌రెడ్డి

శేరిలింగంపల్లి: పన్ను వసూళ్లలో ప్రభుత్వం చేపట్టిన ఎర్లీ బర్డ్ స్కీం విజయవంతం చేసే నిమిత్తం రెవెన్యూ అధికారులతో చందానగర్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ మోహన్ రెడ్డి సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఏఎంసీలు, టాక్స్ ఇన్స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో మోహన్‌రెడ్డి మాట్లాడుతూ... ఎర్లీబర్డ్ స్కీంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ఏడాది ఎర్లీబర్డ్‌లో భాగంగా రూ. 64.41 కోట్ల పన్ను వసూలుకు అవసమైన ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ఈ ఏడాదికి సంబంధించిన ప్రాపర్టీ ట్యాక్స్‌ను ఈ నెల 30వ తేదీలోపు చెల్లించే వారికి 5 శాతం రాయితీ ఇచ్చే విషయాన్ని కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులకు తెలియజేయాలన్నారు. సెలవు దినాల్లో గేటెడ్ కమ్యూనిటీలు, అపార్టుమెంట్లు, కాలనీ అసోసియేషన్ల కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. డాకెట్ వారీగా లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలన్నారు. ప్రాపర్టీ ట్యాక్స్‌ను సర్కిల్ కార్యాలయంలోని సిటిజన్ సర్వీస్ సెంటర్, బిల్ కలెక్టర్లకు, ఆన్‌లైన్‌లో చెలించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మహేందర్‌రెడ్డి, ట్యాక్స్ ఇన్స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

అంజయ్యనగర్ అభివృద్ధిపై నిర్లక్ష్యం వీడాలి

బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వాసువల్లి శ్రీనివాస్



అంజయ్యనగర్‌లో పర్యటిస్తున్న బీజేపీ నేతలు

గచ్చిబౌలి: ఎక్కడ లేని అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు అంజయ్యనగర్ శ్మశాన వాటికలో సౌకర్యాలు ఎందుకు కల్పించలేదో సమాధానం చెప్పాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వాసువల్లి శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు. గురువారం రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు శేరిలింగంపల్లి బీజేపీ ఇంచార్జీ రవికుమార్ ఆధ్వర్యంలో అంజయ్యనగర్, సిద్ధిఖీనగర్, బంజారానగర్‌లో «గావ్ చలో... బస్తీ చలో» కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల, శ్మశాన వాటిక డ్రైనేజీ, అంతర్గత రోడ్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... బస్తీల్లో చెత్త పేరుకుపోయిందన్నారు. డ్రైనేజీ నీరు రోడ్లపై ప్రవహించడంతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. ఇకనైనా అంజయ్యనగర్ అభివృద్ధిపై పాలకులు నిర్లక్ష్యం వీడాలని హితవుపలికారు. బీజేపీ శేరిలింగంపల్లి ఇంచార్జి రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ... ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు. బీజేపీ నాయకులు రాజు, భాస్కర్‌రెడ్డి, రవినాయక్, మన్యంకొండ సాగర్, రాజేందర్, సంతోష్, చందు, ఆత్మారాం, ఓం ప్రకాష్, రేఖ, సరోజారెడ్డి, రెడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా తదితరులు

రాయదుర్గం: వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా పిలుపునిచ్చారు. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలో బీఆర్ఎస్ పార్టీ గచ్చిబౌలి డివిజన్ ముఖ్య నాయకుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తి అయిన నేపథ్యంలో నిర్వహించనున్న వరంగల్ సభ ప్రతిష్టాత్మకమైనదని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. గులాబీ కండువా కప్పుకున్న ప్రతి కార్యకర్తా సమావేశానికి తరలి రావాలన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడడానికి మాజీ సీఎం కేసీఆర్ చేసిన కృషి మరువలేనిదని, ఆతర్వాత రాష్ట్రం అన్ని రంగాల్లో రాణించేలా చేయడానికి కూడా ఆయన నాయకత్వమే కారణమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్తీల్లో సమస్యల పరిష్కారానికి కృషి



నెహ్రూనగర్‌వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ గోపీనగర్, నెహ్రూనగర్, బాపూనగర్‌లలో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ గురువారం పాదయాత్ర నిర్వహించారు. బస్తీల్లో ఓపెన్ డ్రైనేజీల్లో చెత్త నిండిపోవడం, కొన్ని ప్రాంత్రాల్లో స్ట్రీట్‌లైట్లు వెలగడం లేదని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ... బస్తీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఓపెన్ డ్రైనేజీల్లో చెత్తను తొలగించడం, స్ట్రీట్ లైట్లకు వెంటనే మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనుల విషయంలో అధికారులకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే, ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కరిస్తానన్నారు. మెట్రో వాటర్ వర్క్స్ జీఎం బ్రిజేష్, డీజీఎం నరేందర్ రెడ్డి, మేనేజర్ అభిషేక్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ సోందాస్, నాయకులు యాదా గౌడ్, చింతకింది రవీందర్ గౌడ్, లక్ష్మణ్ యాదవ్, రాజ్ కుమార్, శ్రీకాంత్, గఫార్, సాయికిరణ్ గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జైలు నుంచి విడుదలైన ఏబీవీపీ నేత రోహిత్



జైలు వద్ద స్వాగతం పలికిన హెచ్‌సీయూ ఏబీవీపీ విద్యార్థులు

రాయదుర్గం: హెచ్‌సీయూలోని అఖిల భారత విద్యార్థి పరిషత్ సీనియర్ నాయకుడు డాక్టర్ రోహిత్ బొందుగుల సంగారెడ్డిలోని జిల్లా జైలు నుంచి గురువారం విడుదల అయ్యారు. హెచ్‌సీయూ క్యాంపస్ నుంచి పలువురు ఏబీవీపీ నాయకులు జైలు వరకు వెళ్లి ఆయనకు స్వాగతం పలికారు. ఏబీవీపీ జిందాబాద్, హెచ్‌సీయూ భూములను కాపాడు తాం.. కాపాడుతాం అంటూ నినాదాలు చేశారు. అనంతరం అంతా కలిసి గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌కు బయలుదేరారు. క్యాంపస్‌కు రాగానే పెద్ద సంఖ్యలో ఏబీవీపీ నాయకులు, సభ్యులు ఆయనకు ఘనస్వాగతం పలికి పూలమాలతో సత్కరించారు. డాక్టర్ రోహిత్ ప్రస్తుతం హెచ్‌సీయూలో పోస్ట్‌డాక్టోరల్ కోర్సును చేస్తూ ఏబీవీపీ సీనియర్ నాయకుడిగా ఉన్నారు. ఇటీవల హెచ్‌సీయూ క్యాంపస్‌లో ప్రభుత్వం బుల్డోజర్లతో ఈస్ట్ క్యాంపస్‌లో చదును చేసే కార్యక్రమం చేపట్టగా విద్యార్థులు నిరసన తెలిపుతున్న రోహిత్‌ను పోలీసులు అరెస్ట్ చేసి సంగారెడ్డి జిల్లా జైలుకు పంపించారు. కార్యక్రమంలో ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు అనీల్‌కుమార్, కార్యదర్శి ఆయుష్‌కుమార్, నాయకులు శ్రీకాంత్, పరమేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమిస్తాం

బీఆర్ఎస్ నాయకుడు ఆదర్శ్‌రెడ్డి



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఆదర్శ్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజాసమస్యలపై ఎప్పటికప్పుడు ఉద్యమించి పరిష్కారానికి కృషి చేస్తామని బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వి.ఆదర్శ్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందన్నారు. రానున్న రోజుల్లో తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. 27న జరిగే చలో వరంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 19న జిన్నారంలో కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్‌గౌడ్, రాజేష్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై గురువారం కార్పొరేటర్ పుష్ప వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లోని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. త్వరగా పూర్తి చేస్తే ప్రారంభోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. వేసవిలో విద్యుత్, తాగునీటి సమస్య రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ సురేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. బుధవారం నిర్వహించిన తనిఖీల్లో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా ఆరుగురికి రూ.1500 చొప్పున, ఒక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

రోడ్లపై సంతలను తొలగించండి

మణికొండ: నిత్యం ఏదో ఒకప్రాంతంలో రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వారాంతం సంతలు నిర్వహిస్తుండటంతో రాకపోకలు సాగించే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది అవుతున్నదని, వారు చెల్లించే తైబజార్‌తో రోడ్లపై ఆక్రమణలు వెలుస్తున్నాయని వాటిని పూర్తిగా తొలగించాలని నార్సింగి పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ను గ్రేటర్ అలకాపూర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ (గర్వ) నాయకులు కోరారు. గురువారం వారు నార్సింగి లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లలో ఇన్‌స్పెక్టర్‌లు హరికృష్ణారెడ్డి, నిరంజన్‌రెడ్డిలను కలిసి వినతి పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సలహా మండలి సభ్యుడు బాల్‌రెడ్డి మాట్లాడుతూ... వారాంతపు సంతల రూపంలో రోడ్లపై సంతలను నిర్వహిస్తున్నారన్నారు. వాటితో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు. కోట్ల రూపాయల ఆదాయం ఉన్న మున్సిపాలిటీలలో ఓ మార్కెట్‌ను ఒక చోట ఏర్పాటు చేయకుండా ప్రజలకు ఇబ్బంది కలిగేలా సంతలను ఏర్పాటు చేసి వాటి నుంచి రుసుము వసూలు చేస్తూ ఆక్రమణలను ప్రోత్సహిస్తున్నారన్నారు. వాటిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీలకు వాటిని ఏర్పాటు చేయవద్దని లేఖలు రాయాలని కోరామన్నారు. కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలలో నేరాలు జరగకుండా మరిన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, రాత్రి సమయాల్లో పోలీస్ పెట్రోలింగ్‌ను పెంచాలని, భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరామన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన హెచ్‌ఎంకు ఘనంగా వీడ్కోలు

హాజరైన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



చిన్న భీమయ్యను సన్మానిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రిటైర్డ్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు భూమని చిన్న భీమయ్య పదవీ విరమణ సన్మాన కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఉద్యోగ విరమణ చేసిన చిన్న భీమయ్యకు శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, డీసీఎంఎస్ బ్యాంకు చైర్మన్ నర్సింహులు గుప్తా, శేరిలింగంపల్లి ఎంఈఓ కె.వెంకటయ్య, మోమిన్‌పేట్ ఎంఈఓ మల్లేశం, ప్రధానోపాధ్యాయులు రత్నప్రభ, శైలజ, ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు బల్వంత్‌రెడ్డి, పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.మహేందర్‌రెడ్డి, టీఎస్ యూటీఎఫ్ శేరిలింగంపల్లి అధ్యక్షులు జగన్, నాయకులు దేవులపల్లి శ్రీనివాస్, పాండు ముదిరాజ్‌లు హాజరై శాలువా పూల మాలలతో ఘనంగా సత్కరించారు. పలు మండలాల నుంచి తరలివచ్చిన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు భీయమ్యను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



సన్మానిస్తున్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తదితరులు

ఆవిష్కరణలకు ‘ఏఎన్ఆర్ఎఫ్–పీఏఐఆర్’ గ్రాంట్

- ఆరోగ్యం, వైద్యం, సాంకేతికతల్లో పరిశోధన
- హెచ్‌సీయూ బృందాన్ని అభినందించిన వీసీ బీజే రావు



వీసీ బీజే రావును కలిసిన పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు

రాయదుర్గం: హైదరాబాద్ విశ్వవిద్యాలయంలోని బృందానికి ఆరోగ్యం, వైద్య సాంకేతిక పరిజ్ఞానాలలో పరిశోధన, ఆవిష్కరణలకు ప్రతిష్టాత్మకమైన ఏఎన్ఆర్ఎఫ్–పీఏఐఆర్ గ్రాంట్ లభించింది. దేశ వ్యాప్తంగా ఉన్న ఏడు అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్–పార్టనర్‌షిప్స్ ఫర్ యాక్సిలరేటెడ్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్(ఏఎన్ఆర్ఎఫ్–పీఏఐఆర్) ప్రాజెక్టులలో ఒకటిగా ఎంపిక కావడం ద్వారా ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించింది. ఈ విజయం లోతైన సామాజిక ప్రభావంతో అత్యాధునిక, సహకార పరిశోధనలను పెంపొందించడంలో హెచ్‌సీయూ నాయకత్వాన్ని ప్రతిబింబిస్తుంది. ఏఎన్ఆర్ఎఫ్ నుంచి ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు బహుళ విభాగ పరిశోధన, ఆవిష్కరణ, నాయకత్వ ప్రాతలలో హెచ్‌సీయూ అచంచలమైన నిబద్ధత, శ్రేష్టతకు నిదర్శనాన్ని నొక్కి చెబుతుంది. హెచ్‌సీయూ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బ్రహ్మానందం మానవతి, కో ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సిబాకుమార్ ఉద్గాట, డైరెక్టర్ ఆర్ అండ్‌డీ సెల్ ప్రొఫెసర్ సామ్రాట్ ఎల్ సబత్ ఈ ప్రాజెక్ట్ విజయవంతమైన అమలు కోసం స్పోక్ ఇన్‌స్టిట్యూట్‌లతో సమన్వయం చేసుకుంటారు. ఈ గుర్తింపు ఇంటర్ డిసిప్లినరీ పరిశోధన, ఆవిష్కరణలలో జాతీయ నాయకుడిగా హెచ్‌సీయూ స్థానాన్ని మరింత సుస్థిరం చేస్తుంది. ముఖ్యంగా పలు విశ్వవిద్యాలయాలు, సంస్థలతో కలసి పనిచేయడానికి, జీవక్రియ వ్యాధులు, అంటువ్యాధులు, కేన్సర్ల కోసం వాస్తవ ప్రపంచ ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలను అందిస్తుంది. ప్రత్యేకంగా డయాబెటిస్, ఫ్యాటీలివర్ డిసీజ్, డెంగీ, మలేరియా, బ్రెస్ట్ కేన్సర్, బ్లడ్ కేన్సర్‌లను లక్ష్యంగా చేసుకుంది.

హెచ్‌సీయూ... మొత్తం క్లస్టర్‌కు గర్వకారణం

హెచ్‌సీయూకే కాకుండా మొత్తం క్లస్టర్‌కు గర్వకారణమైన క్షణమని హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు స్పష్టం చేశారు. గురువారం ఈ ప్రాజెక్టు సాధనలో కీలకపాత్ర వహించిన పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు వైస్ చాన్స్‌లర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారిని ఆయన అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మా పరిశోధనా పర్యావరణ వ్యవస్థ యొక్క బలానికి నిదర్శన మన్నారు. ఈ ప్రాజెక్ట్ ప్రపంచ ప్రాముఖ్యతతో జాతీయ ప్రాధాన్యతలను పరిష్కరించడానికి సైన్స్, ఆవిష్కరణలను ఉపయోగించుకునే మా లక్ష్యంతో సంపూర్ణంగా సరిపోతుం దన్నారు. ఇవన్నీ కలిసి పనిచేయడం అనే మిషన్ మోడ్ లక్ష్యంతో ఉన్నాయన్నారు.